# యుగ ధర్మం



'మారుతి'

కుశాలరావు భోజనంచేసి భుక్తాయాసం తీర్చుకుంటూ కుర్చీలో మేను వాల్చాడు, విశ్రాంతిలో ఉన్న సుఖాన్ని పూర్తిగా అనుభవిస్తూ.

'సుష్ఠుగా భోజనంచేసి పడుకోవడమే గాని, ఓ తాంబూలం వేసుకోవడం గాని, సిగరెట్టు కాల్చుకోవటం గాని, కనీసం వక్కపొడి నమలటం గాని అలవాటు లేదు. పట్టి బుద్ధావతారం' అని భార్యామణి నిర్మలకు చిరాకు.

పక్కింటి మూర్తిగారు సిగరెట్టు తీసి నోట్లో పెట్టుకోగానే ఆయన భార్య అతి మతారంగా అగ్గిపుల్ల గీసి వెలిగిస్తుంది. నోటితో పొగ పీల్చి రింగులు రింగులుగా గాలిలోకి వదులుతూ ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నట్టు పరవశించిపోతారు. సెలవు రోజు అయితే, భోజనాలు కాగానే ఒకళ్ల కెదురుగా ఒకళ్లు కూచుని సున్నం రాసిన తమలపాకులూ, వక్కపొడీ కలిపి ఆమె అందిస్తుంటే ఆయనగారు తాపీగా అందుకుని నోట్లో పెట్టుకుని నములుతూ ఉంటారు సరదాగా కబుర్లు చెబుతూ.

మూర్తిగారు అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి బ్రాందీ, విస్కీ సేవిస్తుంటారని వినికిడి. మరో ఇల్లాలయితే గుండెలు బాదుకుని ఏడిచి నానా రభసా చేసేదే! కాని, మూర్తిగారి భార్య ఎంతో గర్వంగా తన భర్త అలవాట్లను గురించి చెప్పుకుంటుంది. ఆయనకు జీవితం అనుభవించటం బాగా తెలుసని ఆమె అభిప్రాయం.

“చల్లని మంచినీళ్లు, కూజాలోవి గ్లాసెడు పట్రావే!” అన్నాడు కుశాలరావు.

ఆలోచనలకు అంతరాయం కలిగిన నిర్మల చిరాకు పడింది. 'మంచినీళ్లు అని అడగకూడదూ ... పట్రావేటు! పేరు పెట్టి పిలవటం కూడా చేతకాదు. ఏం మనిషో ఏమో!' అనుకుంది.

“విన్నేనే — వినపడలే? మంచినీళ్లు. కూజాలోవి.” మళ్లీ అరిచాడు కుశాలరావు.

“వినపడింది. వస్తున్నా ... కూజాలోవే తెస్తున్నా” అన్నది నిర్మల, నొక్కి పలుకుతూ.

కూజాలో నీళ్ళు గ్లాసులోకి వంపి తీసుకువచ్చి భర్త చేతికి అందించింది. గ్లాసుడు నీళ్ళూ గటగట తాగేసి గ్లాసు ఆమె చేతికి ఇచ్చాడు.

'అస్తమానం పెళ్లాన్ని ఏమోయ్ అనో, విమలా అని పేరుతోనో పిలుస్తుంటారు మూర్తిగారు. ఈయన అసలు తన భార్యకు ఒక పేరున్నదని కూడా మరిచిపోయి ఉంటారు' అనుకుంది నిర్మల.

కుశాలరావు 'ఏమేవ్' అని పిలిచినప్పుడల్లా తనకు ఒళ్లు మండి, నా పేరు నిర్మల అంటుంది. అంటే మటుకేం? అంత గ్రహింపు కూడానా! “హి హి హి!” అని ఒక నవ్వు నవ్వి ఊరుకుంటారు. పేరుపెట్టి పిలిపించుకోవాలన్న సరదా, అందుకు తను పడిన శ్రమా వృథా అయ్యాయి.

సుష్ఠుగా రెండు పూటలా భోజనం వేయటం తప్పితే ఇంకో అలవాటు లేదు. ఆఫీసుకు వెళ్ళటం, రావటం తప్పితే మరో ధ్యాస గానీ, వ్యాపకం గానీ లేవు.

మూర్తిగారికి వాళ్ళాఫీసులో పనిచేసే లేడీ టైపిస్టు ప్రేమలేఖ వ్రాస్తే, అది తీసుకువచ్చి భార్యకు చూపించాడు. ఆమె అదేదో గొప్ప విషయ మైనట్టు ఇరుగు పొరుగు వాళ్ళందరితో గర్వంగా చెప్పుకుంది,

మూర్తిగారి ఇంట్లో జరిగిన మహిళా మండలి సమావేశంలో ఒక ఇల్లాలు అన్నది నిర్మల నుద్దేశించి — "నీ మొగుడు గంగిగోవు లాంటి వాడమ్మా! నీవు చేసుకున్న పుణ్యం" అని.

అందులో ఏమి గూఢార్థ ముందో గాని అందరూ నవ్వారు. తనకు తల కొట్టేసినట్టయింది. ఈ బుద్ధావతారాన్ని ఎలాగయినా మార్చి నలుగురిలో తన పరువు నిలుపుకోవాలి!

పడక కుర్చీలో పడుకునే నిద్రపో తున్నాడు కుశాలరావు. 'ఏం మనిషో, ఏమో! మంచం మీద పడుకోకూడదూ?' అనుకుంది నిర్మల.

మొహంమీద ఈగలు వాలి అతనికి నిద్రాభంగం కలిగించాయి.

"ఏమేవ్! దుప్పటి" అని కేక పెట్టాడు.

'బాగానే ఉంది సంబడం! వేల కంటుకుపోయిన పడక కుర్చీలో మిట్ట మధ్యాహ్నం వేళ నిండా ముసుగు పెట్టుకుని పడుకుంటే ఇంటికి వచ్చిన వాళ్ళు ఏమిటో అనుకుని హడలి చస్తారు' అనుకుంది నిర్మల.

"పగటిపూట ఆ నిద్రేమిటి — అసహ్యంగా? లేవండి. సెలవు రోజు కూడాను. ఎవరయినా వస్తే బాగుండదు" అన్నది.

కుశాలరావు కళ్ళు తెరిచాడు. "ఈవేళ మా స్నేహితు లెవరూ రారు మన ఇంటికి. వాళ్ళీపాటికి గుర్రపు పందాలలో మునిగి తేలుతూ ఉంటారు" అన్నాడు.

"పోనీ లెండి! మీరు ఇంట్లో ఉండి హాయిగా ఎంచక్కా ... కాసేపు పేక ఆడుకుందాం లేవండి."

"ఛీ ఛీ! ఆ పేక మాట ఎత్తకు. అదంటేనే తలనెప్పి" అని విసుక్కున్నాడు కుశాలరావు. అతనికి ఇంక నిద్ర పట్టలేదు.


"ఈవేళ సెలవు గదా మరి? ఆనక ఫలహారం ఏం చేస్తావే!" అని గోముగా అడిగాడు.

నిర్మలకు ఒంటినిండా ఎర్ర చీమలు పాకినట్టయింది. ఫలహారంట! స్టైలుగా టిఫిన్ అనటం కూడా చేతకాదు. భోజనం చేసి ఇంకా అరగంట కూడా కాలేదు— అప్పుడే మధ్యాహ్నం ఏం తిందా మన్న ఆలోచన.

"దిబ్బ రొట్టె చేద్దా మనుకుం టున్నాను" అన్నది నిర్మల కసిగా.

"నేనూ అదే అనుకుంటున్నాను. ఎంత మంచిదానివే! నా మనసులో మాట నేను చెప్పకుండానే కనిపెట్టేశావ్. దిబ్బ రొట్టెలో కొత్త ఆవకాయ నంచుకుని తింటే ఎంత బాగుంటుం దనుకున్నావ్" అని బద్ధకంగా ఆవులించాడు కుశాలరావు.

"ఏమండీ! ఏమే అనటం మానేసి నన్ను పేరు పెట్టి పిలవండి ఇక నుంచి. అందరూ నవ్వుతున్నారు" అని గునిసింది నిర్మల.




కుశాలరావు తేలికగా నవ్వేశాడు. "నీకు పేరు పెట్టడం ఏమిటే! మీ అమ్మ, నాన్నా పెట్టిన పేరుందిగా!"

"ఆ పేరే పెట్టి పిలవచ్చుగా. ఎన్ని సార్లు చెప్పినా వినరు."

"నిర్మలా! నిర్మలా!" గుమ్మం అవతల నిలబడి పిలిచింది పక్క ఇంటి సుజాత.

"ఎవరో పిలుస్తున్నారు చూడవే!" అన్నాడు కుశాలరావు. నిర్మల రుసరుస లాడుతూ వెళ్ళింది.

"సినిమాకు రెండు గంటల షోకి వెళుతున్నాం నేనూ, మూర్తిగారి భార్య విమలా. నువ్వుకూడా వస్తావా?" అని అడిగింది సుజాత.

"ఉండు. ఆయ న్నడిగి చెబుతాను" అని లోపలికి వచ్చింది నిర్మల. కుశాల రావును దాటి వంట ఇంట్లోకి వెళ్ళి, తిరిగి వచ్చి, "ఇద్దరం కలిసి వెళదా మన్నారు మా వారు" అన్నది. సుజాత ఆశ్చర్యంగా చూసి నవ్వుకుని వెళ్ళిపో యింది.

"ఆ పిల్లతో అబద్ధం ఎందుకు చెప్పావ్!" కుశాలరావు కుతూహలంగా అడిగాడు.

"పెళ్ళైనవరు పిల్ల! ఆమె పేరు సుజాత. అయిదేళ్ల నుంచీ కాపురం చేస్తున్న ఇల్లాలిని పట్టుకుని పిల్లంటారేమిటి!" అని తన కోపం వెళ్ళగక్కింది.

"సినిమా సంగతీ ... అబద్ధం సంగతీ ఏమిటి!" నిలదీశాడు కుశాలరావు.

"అవును. వాళ్లతో వెళ్లటం ఇష్టం లేక అలా చెప్పాను."

"నువ్వు చాలా మంచిదానివి" అని ఊరుకున్నాడు కుశాలరావు.

ఆఖర్ని 'నిర్మలా' అంటాడేమోనని ఆశ పడింది.

చదువూ, ఉద్యోగమూ, సంపాదనా, ఆరోగ్యమూ పుష్కలంగా ఉన్నాయిగాని, సభ్యత, నాగరికత బొత్తిగా తెలీని మనిషి ఈయన అని కాపరానికి వచ్చిన రోజునే తెలుసుకుంది నిర్మల.

ఆరు నెలల నుంచీ ప్రయత్నం చేస్తున్నా ఆయన అలవాట్లలో కాని, మాటలలోకాని రవంత కూడా మార్పు రాలేదు. సూటీ పోటీగా తను అన్నా గ్రహించే శక్తి లేదు. కోపం తెచ్చుకోరు! ఎదురుతిరిగి ఒక్క మాట అనరు.

పెళ్ళిచూపు లయిన తరవాత అమ్మా, నాన్నా తెగ మెచ్చుకున్నారు కాబోయే అల్లుణ్ణి. 'పిల్లవాడు బుద్ధిమంతుడు. ఏ అలవాటూ లేదు. అల్లరి చిల్లరగా తిరగడు. చదువుకున్నవాడు. మంచి ఉద్యోగం... ఈ సంబంధం గనక ఖాయ మయితే అమ్మాయి నిజంగా అదృష్ట వంతురా లనుకోవాలి' అని ఊహా ఇదయిపోయారు.

తను కూడా పెళ్లి చూపుల్లో, మొదటి సారిగా చూసినప్పుడు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి, ఆలేఖ్య తనూ విలాసుడు అనుకుందే గాని, ఇంత శుద్ధ బుద్ధావతారం అనుకోలేదు.

పెళ్లి చూపుల సమయంలో ఆయన ముందు పెట్టిన ఫలహారం శుభ్రంగా తినేశాడు, మర్యాదకోసమయినా కాస్త వదిలి పెట్టకుండా. తన చెల్లెలు కాఫీ గ్లాసు అందివ్వబోతే, "ఉహూః! పాలు తాగుతాను" అన్నాడట.

అది అసలే చిచింద్రీ. అక్కడే కిసుక్కున నవ్వి, లోపలికి వచ్చి అందరితో చెప్పింది, "పెళ్లికొడుకు పాలు తాగు తాట్ట!" అన్న వైనం.

నాన్నగారు విషయం గ్రహించి, "చిక్కని పాలలో చక్కెర వేసి పట్టుకు రా, అమ్మా!" అని పురమాయించారు. తియ్యగా ఉన్న వేడి పాలు లొట్టలు వేసుకుంటూ తాగాడట ఆయన! ఇప్పటికీ ఆ సంగతులు జ్ఞాపకం తెచ్చుకుని నవ్వు తుంటుంది చెల్లెలు.

ఎన్ని విధాల ప్రయత్నం చేసినా ఆయనచేత కాఫీ తాగించలేకపోయింది తను.

"మా ఇంట్లో కాఫీ ఖర్చే నెలకు నలభై రూపాయలు దాటుతుందమ్మా" అని గొప్పగా చెబుతుంది మేడమీది వాటాలో ఉన్నావిడ.

మూర్తిగారి ఇంట్లో అయితే,

( తరువాయి 39 వ పేజీలో )

# యుగధర్మం

(35 వ పేజీ తరువాయి)

ఆయనకు వచ్చే జీతంలో సగం ఆయన కాల్చే సిగరెట్లకూ, కాఫీ, టిఫిను ఖర్చులకూ సరిపోతుందట. జీతం చాలక ఇంటి నుంచి తెప్పించుకుంటారట!

'వెధవ డబ్బు ఏం చేసుకోను, సరదాలు లేకపోయిన తరవాత' అనుకుంది నిర్మల.

"పొగ తాగని వాడు దున్నపోతయి పుట్టున్ అన్నాట్టండీ ఒక తెలిసిన పండితుడు. అందుకని మీరు కూడా మెల్లగా అలవాటు చేసుకోండి సిగరెట్లు కాల్చటం ... మీరు సిగరెట్టు నోట్లో పెట్టుకుంటే నేను అగ్గిపుల్ల గీసి వెలిగిస్తాను ... మీరేమో అప్పుడు పొగ నా మొహం మీదికి వదలండి. ఆ పొగ వాసనంటే నా కెంతో ఇష్టం" అన్నది నిర్మల, అతని పక్కనే కూర్చుని.

"అమ్మ దొంగా! అట్లా చెప్పు!" అన్నాడు కుశాలరావు. నిర్మల ముఖం వికసించి చేటంత అయింది.

"ఇన్నాళ్ళ మంచీ చెప్పలేదేం మరి! మీ అమ్మను రమ్మని రాసే వాడినిగా?"

"ఆవిడ ఎందుకండీ మధ్యలో! అంతగా అయితే మీరు సిగరెట్లు కాల్చటం బాగా అలవాటు చేసుకున్న తరవాత మన చుట్టాలందరినీ పిలిచి అందరి ముందూ సిగరెట్టు స్టైలుగా కాల్చి చూపిద్దురు గాని" అంది నిర్మల.

"అది కాదే! ... ఇందాక నువ్వన్నావు చూడు, సిగరెట్టు పొగ వాసనంటే నీకు ఇష్టమనీ... అట్లాంటి కోరికలు..." అని మిగతాది ఆమె చెవిలో చెప్పాడు.

"అయ్యో రాత! నే నొకటి చెబితే మీ రొకటి మాట్లాడతారు. మీరు అనుకున్నదేమీ కాదండీ" అన్నది నిర్మల హతాశురాలై.

'పాపం, అప్పుడే పిల్లలు కావాలన్న సంబడం కాబోలు ఈయనకు' అని తల పట్టుకుంది.

"తల నెప్పిగా ఉందా! అమృతాంజనం రాసుకో" అన్నాడు కుశాలరావు.

'రాసుకో అనకపోతే తను రాయకూడదు కాబోలు! ఏం మనిషో ఏమో!' అనుకుంటూ నిర్మల అతని పక్కనుంచి లేచి వెళ్లి గదిలో పడుకుంది.

ఈయన్ను మార్చటం బ్రహ్మాతరం కూడా కాదు అనుకుంది.

'నిర్మల ఈ వేళ ఎందుకో చిరాకాగా ఉంది పొద్దుటి నుంచీ. కోపం వచ్చిందా? ఆమెకు కోపం వచ్చే పని తనేమయినా చేశాడా?' అని ఆలోచించాడు కుశాలరావు. అటువంటిదేమీ జరిగినట్టు గుర్తు రాలేదు.



భగ్న శిల్పం
ఫోటో—ఎస్. బి. ఆకరకర (కొల్హాపూర్)

ఏదో కుట్టినట్టు ఉలిక్కిపడి లేచాడు. వాకిట్లోకి, ఇంట్లోకి పచార్లు చేశాడు. షర్టు తొడుక్కుని వీథిలోకి వెళ్లి ఒక దుకాణం ముందు ఆగి, పది పైసలు ఇచ్చి మంచి సిగరెట్టు ఇమ్మన్నాడు. కొట్టువాడు ఇచ్చిన సిగరెట్టు తెచ్చి తలుపు కున్న చిన్న కన్నంలో పెట్టాడు. అగ్గిపుల్ల గీసి వెలిగించి బయటికి వెళ్లి అరుగుమీద కూర్చున్నాడు.

గదిలో పడుకున్న నిర్మలకు సిగరెట్టు పొగ వాసన వేసి ఆశ్చర్యపోయింది. 'తను అన్న మాటలకు రోషం తెచ్చుకుని సిగరెట్టు కాలుస్తున్నారల్లే ఉంది, పాపం! ... పాపిష్ఠి దాన్ని. ఆయన్ని ఎంత కష్టపెట్టాను... పొగ పీల్చటం చేతకాక ఉక్కిరి బిక్కిరయి ఎంత హైరాన పడుతున్నారో!' అనుకుంటూ లేచి ఇవతలకు వచ్చింది.

అగరుబత్తిలా నిలబడి కాలుతున్న సిగరెట్టు కనపడింది గాని, ఆయన జాడ ఎక్కడా కనిపించలేదు.

వాకిట్లో అరుగు మీద కూర్చుని లోపలికి తొంగి చూస్తున్న కుశాలరావును చూసిన నిర్మల నవ్వకుండా ఉండలేకపోయింది.

"హమ్మయ్య!" అంటూ లోపలికి వచ్చాడు కుశాలరావు. "వాసన బాగుందా?" అని అడిగాడు.

గ్లాసుడు నీళ్లు తెచ్చి కాలుతున్న సిగరెట్టు మీద పోసి ఆర్పేసింది నిర్మల.

"అదేమిటి! అప్పుడే మొహం మొత్తిందా!" అన్నాడు కుశాలరావు.

"ఈ భవంతిలో ఉన్న అరడజను వాటాల్లో ఉన్న మొత్తం ఒకటి తక్కువ డజను మంది మగాళ్ళలో మీరు తప్ప అందరూ సిగరెట్టు అలవాటు ఉన్న వాళ్లే." అక్కసుగా అన్నది నిర్మల.

కుశాలరావు ఔనని వెంటనే ఒప్పుకున్నాడు. "నాకు సైకిలు తొక్కటం కూడా రాదు. మరి ఆ వాటాలో ఉన్న వాళ్లలో చాలా మందికి స్కూటర్లు కూడా ఉన్నాయి. ఎట్లాగయినా సైకిలు తొక్కటం నేర్చుకుందామని ఉన్నదే!" అన్నాడు.

"కిందటి ఆదివారం నాడు నేర్చుకున్నారుగా చాలు. సైకిలు పెడలు మీద కాలుపెట్టే వీథి చివరిదాకా నెట్టుకుంటూ వెళ్లటం ఆరు వాటాల వాళ్ళు చూసి ఆనందించారు." నిర్మల జ్ఞాపకంచేసింది.

"అవునవును. సుబ్బమ్మగారు ఎండ పెట్టుకున్న బియ్యపు పిండి చేటలో సైకిలుతోసహా పడ్డానని ఆ రోజంతా తిడుతూనే ఉంది కదూ?" అని కుశాలరావు నొచ్చుకున్నాడు, ఆమె అట్లా నోరు పారేసుకున్నందుకు.

"సైకిలు నేర్చుకోవటం ఎట్లాగయినా కొంచెం కష్టంగానే ఉంది గాని, స్కూటరు నేర్చుకుంటానే!"

"మీరు అన్నీ నేర్చుకుంటారు. అంత తెగింపూ, చొరవా ఉంటే ఇంకా లేనిదేముంది!" అన్నది నిర్మల.

కుశాలరావు చిన్నబుచ్చుకున్నాడు.

• • •

నిర్మల కళ్లనీళ్లు పెట్టుకుంది. అక్కను చూసిపోదామని వచ్చిన మంజులకు బావ ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది.

రాత్రి పది దాటితే గాని ఇంటికి రావటం లేదట. తెరలు తెరలుగా దగ్గు వస్తున్నా విడవకుండా రోజుకు మూడు పెట్టెలు సిగరెట్లు కాలుస్తున్నాడట. డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నాడట.

ఒక సాయంత్రం స్నేహితుని మోటారు సైకిలు మీద కుశాలరావు వాళ్ల ఆఫీసులో పనిచేసే లేడీ టెలిఫోన్ ఆపరేటరు కలిసి వెళుతుండగా మూర్తిగారు చూసి ఆ వింతను వాళ్లావిడతో చెబితే, ఆమె నిర్మల చెవిని వేసిపోయింది.

"బావ ఇంక మారడంటావా, అక్కా?" మంజుల అమాయకంగా అడిగింది.

మూర్తిగారి ఇంట్లో సమావేశమయిన మహిళల నవ్వులు వింటున్న నిర్మలకు మంజుల అడిగిన ప్రశ్న వినపడలేదు! ★